క్లుప్తంగా

ఆర్టీసీ లక్కీ డ్రాలో పలువురికి బహుమతులు



లక్కీ డ్రా తీస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో తాళ్లూరు, పొందూరు, గుండాయపాలెం రూట్లలో ప్రయాణికులను ప్రోత్సహించేందుకు 15 రోజులకోసారి నిర్వహిస్తున్న లక్కీ డ్రాలో బుధవారం పలువురికి బహుమతులు లభించాయి. తాళ్లూరు రూట్‌లో ప్రయాణించిన తెల్లబాడుకు చెందిన మల్లిపెద్ది ఆదిలక్ష్మి, పొందూరు రూట్‌లో ప్రయాణించిన ఒంగోలు ఇస్లాంపేటకు చెందిన జి.ఇబ్రహీం, గుండాయపాలెం రూట్లో ప్రయాణించిన కె.రవికుమార్ లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో ఒంగోలు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఆర్ఎం నాయక్, సూపరింటెండెంట్ (ఎఫ్) కె.నాగేశ్వరరావు, కంట్రోలర్ వై.హనుమంతరావు, సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు చీమకుర్తి విద్యార్థిని



సాయిలత

చీమకుర్తి: చీమకుర్తిలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూలుకు చెందిన ఏ సాయిలత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ కే వెంకట్ బుధవారం తెలిపారు. ఈ నెల 15న పాకల జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లో సాయిలత ఎంపికై నట్లు చెప్పారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున సాయిలత పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లు, తల్లిదండ్రులు క్రీడాకారిణిని అభినందించారు.

పదోన్నతి పొందిన పద్మ కుమారికి ఘన సన్మానం



పద్మకుమారిని సన్మానిస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది

ఒంగోలు సిటీ: జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.పద్మకుమారి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది నెల్లూరు జిల్లా డీఈఓ కార్యాలయంలో పర్యవేక్షకురాలిగా చేరిన సందర్భంగా బుధవారం ఘనంగా సన్మానించారు. డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ అధ్యక్షతన సమగ్రశిక్ష కార్యాలయ సిబ్బంది పాల్గొని పద్మకుమారిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు ఆదిలక్ష్మి, కె.ఉమా, ఎస్.పేరయ్య, ఏ శ్రీదేవి, బి.గౌరి, జి.ఎస్.చైతన్య తదితరులు పాల్గొన్నారు.


230 మంది పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సంకల్ప్ ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30వ వారం పేదలకు అన్నదానం చేశారు. ఎన్నారై కోడే వరుణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా 230 మందికిపైగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ నారాయణస్వామి చౌదరి, గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనాబేగం, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ శీలం మల్లారెడ్డి, ట్రస్ట్ సభ్యుడు కొప్పోలు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మట్టా పోలిశెట్టి, కే మురళి తదితరులు పాల్గొన్నారు.

జండర్ ఆధారిత హింస లేని దేశంగా తీర్చిదిద్దాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సుభాషిణి, విద్యార్థులు

కొత్తపట్నం: జండర్ ఆధారిత హింస లేని దేశంగా మనదేశాన్ని తీర్చిదిద్దాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా బుధవారం రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీదేవి, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి షురూ..!

- ప్రధాన కూడళ్లలో శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ ఫ్లెక్సీలు, స్టార్లు
- మార్కెట్లో జోరందుకున్న క్రిస్మస్ సామగ్రి విక్రయాలు
- ముస్తాబైన చర్చిలు, క్రైస్తవుల నివాసాలు
- పేదలకు క్రిస్మస్ కానుకగా దుస్తులు, వస్తువుల అందజేత
- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సంతనూతలపాడు క్రిస్టియన్‌పాలెంలో ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్



అమ్మకానికి ఉంచిన క్రిస్మస్ ట్రీలు, స్టార్లు

సంతనూతలపాడు: క్రిస్మస్.. క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. ప్రపంచ వ్యాప్తంగా ఒకే తేదీ ఒకే సమయంలో అత్యధికులు జరుపుకునే వేడుక. క్రీస్తు జన్మ వృత్తాంతానికి చిహ్నంగా ప్రతి ఏటా డిసెంబర్ 25వ తేదీ క్రైస్తవులు, విశ్వాసులు ఎంతో ఘనంగా ఈ పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. ఇప్పటికే జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో నెలరోజుల ముందు నుంచే ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. క్రైస్తవ ఆరాధికులు సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు నిర్వహించడం అనాదిగా వస్తోంది. సెమీ క్రిస్మస్ పేరిట క్రైస్తవయేతరులు సైతం పండుగ జరుపుకుంటూ మతసామరస్యాన్ని చాటుకుంటారు.

అలంకరణలకు అధిక ప్రాధాన్యం...

సంబరంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు అలంకరణలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. దీంతో క్రైస్తవుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లో అందుబాటులోకి వచ్చిన క్రిస్మస్ అలంకరణల సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. ఒకవైపు ముందస్తుగానే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాన కూడళ్లు, చర్చిల వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరోవైపు క్రిస్మస్ స్టార్లు ఆకర్షిస్తున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో చర్చిలు కళకళలాడుతున్నాయి. ఇక ఇళ్లను అలంకరించుకునే పనిలో క్రైస్తవులు నిమగ్నం కావడంతో జిల్లా అంతటా కోలాహలం నెలకొంది.

షాపుల్లో సందడి..

క్రిస్మస్ పండుగకు ముందుగా నెలరోజుల పాటు సాగే సెమీ క్రిస్మస్ వేడుకల్లో వినియోగించే అలంకరణల సామగ్రి కొనుగోళ్లతో షాపులు కిటకిటలాడుతున్నాయి. ఇళ్లు, చర్చిలు అలంకరించడానికి వినియోగించే వస్తువుల విక్రయాలు ఊపందుకోవడంతో మార్కెట్లన్నీ బిజీబిజీగా ఉన్నాయి. క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్, కీచైన్స్, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపే వివిధ రకాల వస్తువులు షాపుల్లో కొలువుదీరాయి. అత్యాధునిక, విద్యుత్ దీపాలతో కూడిన వస్తువులు ప్రత్యేకంగా వినియోగదారుల్ని ఆకర్షిస్తున్నాయి. నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలకు మార్కెట్లో గిరాకీ ఉంది. నక్షత్రం సైజు, నాణ్యత ఆధారంగా రూ.100 నుంచి మొదలై రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అలాగే, విద్యుత్ కాంతులతో ఉన్న క్రిస్మస్ ట్రీ ధర రూ.500 వరకు ఉండగా, సాధారణ క్రిస్మస్ ట్రీల ధరలు రూ.50 నుంచి రూ.250 వరకు ఉన్నాయి. ఇక బహుమతులు, చాక్లెట్లు, గంటలు, గాజుగోళాలు వంటి వాటిని కూడా భారీగానే కొనుగోలు చేస్తున్నారు. పిల్లల కోసం ఉపయోగించే శాంతాక్లాజ్‌ల ధర రూ.200 నుంచి రూ.1000 వరకు ఉంది.

భారీగా బహుమతుల కొనుగోళ్లు...

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొందరు క్రైస్తవులు బహుమతులుగా పేదలకు దుస్తులు, వేలు రకాల వస్తువులు అందిస్తుంటారు. దీంతో బహుమతుల కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. ఇప్పటికే కొందరు క్రిస్టియన్లు బహుమతులు, దుస్తులు కొనుగోలు చేసి పేదలకు అందజేస్తున్నారు. వృద్ధాశ్రమాలు, దివ్యాంగులు, అనాథలు ఉండే ఆశ్రమాలకు వెళ్లి వాటిని పంపిణీ చేస్తున్నారు. క్రిస్మస్ పండుగతో పాటు తమ పెద్దల గుర్తుగా కొందరు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కొత్త దుస్తులు కూడా కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్లో పండుగ కోలాహలం నెలకొంది.



దుకాణాల్లో సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి



క్రిస్మస్ సామగ్రితో నిండిపోయిన దుకాణం

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి



మద్దిపాడు పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి

మద్దిపాడు: విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బాలల హక్కుల కమిషన్ బీ పద్మావతి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రం మద్దిపాడు లో కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలతో పాటు వారికి రక్షణ కల్పించాలని ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డికి సూచించారు. వంట గదులను పరిశీలించారు. అనాథలైన విద్యార్థులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.4 వేల చొప్పున మంజూరు చేస్తున్నాయని వెంటనే అటువంటి విద్యార్థుల జాబితా తమకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. కళాశాల, పాఠశాల విద్యార్థినులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. భవిత పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో అక్కడ దివ్యాంగుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. అక్కడ నుంచి అంగన్‌వాడీ స్కూలును సందర్శించారు. రికార్డుల్లో కొట్టివేతలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ ను సీడీపీవో తనిఖీ చేస్తున్నారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం బీసీ, ఎస్సీ హాస్టల్స్ ను సందర్శించారు. విద్యార్థులను వారికి అందుతున్న సౌకర్యాల గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో అక్కడక్కడా ఉన్న సమస్యలపై అసహనం వ్యక్తం చేశారు. బీసీ హాస్టల్ ను సందర్శించిన క్రమంలో బీసీ హాస్టల్ పూర్తిగా దెబ్బతిని ఉండటం, బాత్రూములకు తలుపులు లేకపోవడం గమనించి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే హాస్టల్ ను ఖాళీ చేసి వేరే చోటికి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంఈఓ ఎం శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చిన్నకోటేశ్వరరావును సన్మానిస్తున్న సంఘస్తులు

మద్దిపాడు: మండల కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మద్దిపాడులోని విలియం కేరి తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపుల ఆధ్వర్యంలో ఐదడుగుల భారీ కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆనందోత్సాహాల మధ్య సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా కర్లపాలెనికి చెందిన నాయోతు ప్రాఫిటిక్ మినిస్ట్రీస్ దైవ వర్తమానికులు రెవరెండ్ గోన ఇస్సాకు దైవ సువార్త ప్రసంగం చేశారు. దైవ సహాయకుడు రెవరెండ్ అబ్రహం దేవుని ఆశీసులు సర్వజనులకు ఉండాలని ప్రార్థన చేశారు. చర్చి అభివృద్ధికి సహకరిస్తున్న చర్చి సంఘ అధ్యక్షుడు పాటిబండ్ల లాభాను, కార్యదర్శి చిన్న కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు రేపూరి జయరావు, గుంటూరు ఆదం తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ సూచించారు. సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించగా, వేములపాడు ఇన్‌చార్జి వీఆర్ఓ కే హనుమంతరావు పర్యవేక్షించారు. రైతుల నుంచి 25 అర్జీలు దాఖలయ్యాయి. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు నడుం బిగించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్ బాబు

సంతనూతలపాడు: మండలంలోని గ్రామాల్లో పరిశుభ్రతకు పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. ఈ నెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు రెండో బ్యాచ్ అధికారులకు శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం తొలిరోజు శిక్షణ ఇచ్చారు. తొలుత మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో సురేష్‌బాబు, ఈవోఆర్డీ రమణమ్మ, ఎంఈఓ వెంకారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మధుసూదనరావు, వేములపాడు మెడికల్ ఆఫీసర్ సుమన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు ప్రసంగించారు. క్లీన్ అండ్ గ్రీన్, ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యపరమైన విద్య, తదితర విషయాలపై ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభ్యున్నతికి గ్రామ స్థాయి అధికారులు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వేములపాడు ఆరోగ్యశాఖ ప్రతినిధి శేషారావు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామాల సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామాల వ్యవసాయ సహాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిలకపాడులో పాఠశాలల తనిఖీ

సంతనూతలపాడు: మండలంలోని చిలకపాడు గ్రామంలో జెడ్పీ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ కిరణ్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల తీరును పరిశీలించారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు సెలవులో ఉండటంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. విద్యార్థులంతా స్కూల్లోనే మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం బియ్యం స్టాకులో 16 కేజీలు ఎక్కువ ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, తదితర విషయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు పెంపొందించాలని హెచ్‌ఎం పి.స్వప్నరాజు, ఉపాధ్యాయులను ఆదేశించారు.

పలు ప్రాంతాల్లో పొలం పిలుస్తోంది

సంతనూతలపాడు: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. సంతనూతలపాడు మండలంలోని ఎనికపాడు, ఎం.వేములపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి పి.పావని ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు వివరించారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని కొత్తకోట, నిడమానూరు గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులచే బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.వెంకట్రావు పాల్గొని మాట్లాడారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: రైతులు ప్రతి పంటను ఈ-క్రాప్లో నమోదు చేయించుకోవాలని చీమకుర్తి మండల వ్యవసాయ అధికారి డీవీ భాస్కర్ సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం రామచంద్రాపురంలో వరి పంటను పరిశీలించారు.

కానిస్టేబుళ్ల సేవలు అభినందనీయం



బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సత్కరిస్తున్న సీఐ, ఎస్సై

నాగులుప్పలపాడు: కానిస్టేబుళ్ల సేవలు అభినందనీయమని ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్‌బాబు అన్నారు. నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై వివిధ స్టేషన్లకు వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, రమేష్, సురేష్‌బాబు, సైదావలి, జానకిలకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. సీఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ప్రవర్తించి నిజాయితీగా ఉండటం ద్వారా అందరి మన్ననలు పొందాలన్నారు. అనంతరం వారిని సన్మానించారు.

పరిశ్రమల సర్వేను వేగవంతం చేయాలి



సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల సర్వేను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి డీఎల్‌డీఓ, నాగులుప్పలపాడు మండల ఎంపీడీఓ వై.మహాలక్ష్మి సూచించారు. మండలంలోని ఉప్పుగుండూరులో జరుగుతున్న సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. సర్వే మందకొడిగా సాగుతుండటంతో అధికారులపై మండిపడ్డారు. వెంటనే సర్వే పూర్తిచేయాలన్నారు. ఇదేవిధంగా కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల సమావేశం



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ మద్దిపాడు మండల అధ్యక్షుడు యల్లమంద

మద్దిపాడు: స్థానిక నటరాజ కళా కేంద్రం ఆవరణలో బుధవారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ మండల అధ్యక్షుడు డి.యల్లమంద అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా హాజరైన ప్రకాశం జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు వి.పున్నయ్య, బి.అంకిరెడ్డి, ఎం.రామకృష్ణ, డాక్టర్ కె.సుబ్బారావు, జి.రామకోటేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఎం.వెంకట్రావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పీ పేరయ్య తదితరులు విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వాలు తమ సేవలను ఉపయోగించుకుని తమకు చేస్తున్నటువంటి అన్యాయాలను నిలదీశారు. అనంతరం బాపట్ల వెంకటేశ్వర్లు, మాచవరపు సీతారామయ్య, షేక్ ప్యారీ బేగం, ఎస్.గురుబ్రహ్మం ఎం.జయమ్మలను మద్దిపాడు విశ్రాంత ఉద్యోగుల సంఘం తరఫున సన్మానించారు. కార్యక్రమంలో మద్దిపాడు విశ్రాంత ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, కోశాధికారి జి.కోటేశ్వరరావు, గంగిశెట్టి నరసింహారావు, కలాం మాస్టారు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

- ఎస్‌బీఐ అమరావతి జీఎం శైలేష్‌కుమార్
- ఒంగోలు భాగ్యనగర్ నాలుగో లైన్‌లో నూతన బ్రాంచ్ ప్రారంభం



ఎస్‌బీఐ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అమరావతి సర్కిల్ జీఎం శైలేష్‌కుమార్, అధికారులు

ఒంగోలు సబర్బన్: ఖాతాదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించడమే తమ లక్ష్యమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్ అన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ల సమావేశం నిర్వహించారు. భాగ్యనగర్ ఎస్‌బీఐ నూతన బ్రాంచ్ కార్యాలయాన్ని గుంటూరు పరిపాలనా కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ క్రిష్ణకుమార్ బి.ప్రభు, ఒంగోలు రీజినల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాంక్ నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులకు మరింత చేరువగా సేవలందించడానికి భాగ్యనగర్ ప్రాంతంలో నూతన శాఖను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంత వాసులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఏసీపీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.టి.వెంకట్రావు, భాగ్యనగర్ శాఖ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు కె.హారతి, ఎల్.వి.వి.నాగేశ్వరరావు, వేదం రాజేష్ బాబు, హెచ్ఆర్ మేనేజర్ ఏఎస్‌వీఎస్ నళినీకాంత్, ఆర్ఓటీ సూపర్ వైజింగ్ చానల్ మేనేజర్ కె.జానకిరామయ్య, ఆఫీసర్ల అసోసియేషన్ డిప్యూటీ రీజినల్ సెక్రటరీ వి.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, రమేష్, పి.బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్లను సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

చీమకుర్తి: పెన్షనర్ల దినోత్సవాన్ని బుధవారం చీమకుర్తిలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు పెన్షనర్లను సత్కరించారు. 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లను మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య చేతుల మీదుగా శాలువాలు కప్పి సత్కరించారు. పెన్షన్ల సాధనలో పితామహుడిగా వ్యవహరిస్తున్న ధరమ్ స్వరూప్ నకారా చేసిన సేవలను గుర్తు చేసుకుని ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మర్రి లక్ష్మీనారాయణ, బండ్ల డేవిడ్, సంఘంలోని సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ నేత.. టాన్యా



టాన్యాకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజా వైద్యురాలిగా, ఐద్వా ఉద్యమ నాయకురాలిగా డాక్టర్ టాన్యా సమాజానికి ఎనలేని సేవలందించారని డాక్టర్ ఉదయని కొనియాడారు. బుధవారం టాన్యా 83వ జయంతిని పురస్కరించుకుని స్థానిక బెతూన్ నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికిపైగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, పాప్సమీర్, మెముగ్రామ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉదయని మాట్లాడుతూ డా.టాన్యా స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. మహిళలు సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని, వారిలో చైతన్యం కలిగించేందుకు అనేక కార్యక్రమాలను టాన్యా నిర్వహించారని తెలిపారు. ఎంఎస్ఆర్ క్యాన్సర్ వైద్యశాలకు చెందిన డాక్టర్ దీప్తి క్యాన్సర్ వ్యాధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం టాన్యా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు రంగారావు, డాక్టర్ పురుషోత్తమరావు, డాక్టర్ సందీప్ ప్రకాష్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, నాగూర్, ఆదిలక్ష్మి, రాజేశ్వరి, పద్మ, విజయలక్ష్మి, ప్రేమలత, అమీరున్నీసా, పెద్ద గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.